క్లుప్తంగా

ఓటరు నమోదుపై అవగాహన



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం దుగ్గిరాల మండలంలోని చిలువూరులో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు నమోదు, పోలింగ్ బూత్, గ్రామం మార్పు తదితర విధానాలపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులలో ఓటు హక్కు నమోదు ఒకటి అని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందవచ్చని అన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా పి.సురేష్ వ్యవహరించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కించేందుకు ఆసక్తి ఉన్న భక్తులు సదరు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం

తాడేపల్లిరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు మానికొండ డాంగే జెండాను ఆవిష్కరించారు. గేటు వద్ద ఉన్న మునగాల రామారావు, నెహ్రూ బొమ్మ సెంటర్‌లో కర్రి సీతారామయ్య స్థూపం వద్ద తుడిమెల్ల వెంకటయ్య, నులకపేటలో రామారావు జెండాను ఆవిష్కరించారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుల తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో మున్సిపల్ కార్మికుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య, మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి మేకల డేవిడ్, కార్మికులు మల్లెల ఆదాం, బాజీ, చిన్నప్ప, ఇస్సాకు కృష్ణ తులసి, కోటేశ్వరి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షా -2 ఉపయోగించుకోవాలి

తాడికొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తాడికొండ మండల ఎంపీడీఓ అత్తోట దీప్తి అన్నారు. మండలంలో బుధవారం నుంచి సచివాలయాల వారీగా జరుగుతున్న ఆరోగ్య సురక్షా -2 షెడ్యూల్‌ను విడుదల చేశారు.

బీజేపీకి రామ్మోహనరావు రాజీనామా

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణానికి చెందిన జగ్గారపు రామ్మోహనరావు(రాము) బీజేపీ సభ్యత్వంతో పాటు రాష్ట్ర వీవర్స్ సెల్ కన్వీనర్ పదవికి రాజీనామా చేసినట్లు మంగళవారం తెలిపారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల కారణంగా పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరికి రాజీనామా లేఖను పంపినట్లు చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో పూరిలు దగ్ధమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ఉడతా శివమ్మ, ఉడతా పాములమ్మ వీరి చిన్న కుమారుడు ఉడతా కరీముల్లా, కృష్ణవేణి, వీరంతా ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరింటికి నిప్పు అంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలానికి మేడికొండూరు తహసీల్దారు శ్రీనివాసశర్మ పరిశీలించారు. ప్రమాదంలో రూ. 2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

సాయి క్షేత్రంలో దత్త జయంతి

తెనాలిటౌన్: నంది వెలుగులోని శ్రీ సాయి క్షేత్రంలో మంగళవారం శ్రీ దత్త జయంతి నిర్వహించారు. షిర్డి సాయిబాబా, దత్తాత్రేయ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. సాయి క్షేత్రం వ్యవస్థాపక చైర్మన్ ఎంవీ హరిప్రసాదరావు, కార్యదర్శి శ్రీవల్లి, ఉపాధ్యక్షులు పార్వతి, ట్రస్టీలు శ్రీ సుకుమార్, ఆధ్యాత్మిక భాగవతారిణి శారదా చలపతి పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే ఆడుదాం- ఆంధ్రా

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించినట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. ఆటల పోటీలను మంగళగిరి నియోజకవర్గంలోని డాన్ బాస్కో స్కూల్‌లో వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి, ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్‌తో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీల్లో యువకులు తమ ప్రతిభను చాటడం ద్వారా భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయని చెప్పారు. ఆటల పోటీల వలన శరీర ధృఢత్వంతో పాటు మానసికంగా ఎంతో ఆనందాన్ని పొందుతారని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బిక్కరెడ్డి శివారెడ్డి, సెక్రటరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిలో....

తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని గుడ్‌న్యూస్ స్కూల్, బ్రహ్మానందపురంలోను, ఉండవల్లి దేవాదాయ శాఖ భూముల్లో నిర్వహించిన ఆటల పోటీలను వైఎస్సార్ సీపీ మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రారంభించారు. ఉండవల్లిలో డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సెక్రటరి రాధాకుమారి, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఉండవల్లి కన్వీనర్ కళ్ల రాజశేఖర్‌రెడ్డిపాల్గొన్నారు.



మంగళగిరి రూరల్ డాన్‌బాస్కో స్కూల్‌లో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిరంజీవి తదితరులు

దుగ్గిరాలలో....

దుగ్గిరాల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.వీరయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, బీసీ సెల్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మరత్నం, జమ్ముల లోకేష్ పాల్గొన్నారు.

మేడికొండూరులో..

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్లలోని ఎస్‌జీవీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభించా. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ హాజరై జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ షేక్ గాలిబ్, మన్నవ రాజేష్, పంచాయతీ కార్యదర్శి రెహమాన్, బి.రమేష్, ఉడతా ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫిరంగిపురం: గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడలు దోహదపడతాయని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలోని ఆటస్థలంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, సర్పంచి నాగమల్లేశ్వరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ విలియమ్స్ మాట్లాడుతూ మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సంబంధిత సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది కృషి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని సచివాలయాల పరిధిలో పురుషులు, మహిళలు కలిపి 4,333 మంది వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వారిలో 4,021 మందికి పాల్గొనేందుకు అవకాశం కల్పించామన్నారు. ఆడుదాం ఆంధ్రా నిర్వహించే క్రీడా ప్రాంగణాల వద్ద సంబంధిత గ్రామాల పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు.



దుగ్గిరాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ



క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు వేమారెడ్డి తదితరులు

ఆడుదాం- ఆంధ్రాను సద్వినియోగం చేసుకోండి



పొన్నెకల్లులో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



తుళ్లూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బుర్రా వెంకట శివారెడ్డి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

పొన్నెకల్లు(తాడికొండ): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. చిన్నారులకు బ్యాట్‌లు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. షటిల్ బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎందరో సరైన సౌకర్యాలు లేక మరుగున పడిపోతున్నారని, అలాంటి వారిని గుర్తించి తగిన శిక్షణ ఇవ్వడం ద్వారా మెరికల్లాంటి క్రీడాకారులను రాష్ట్రానికి, దేశానికి అందించవచ్చనే మంచి ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం నేడు రాష్ట్రంలో పండుగ వాతావరణం నింపించదన్నారు. కార్యక్రమంలో సర్పంచి నూకతోటి మేరిమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, మండల ప్రత్యేకాధికారి పరిశ్రమల శాఖ డీడీ దొడ్డా సుధాకర్, ఎంపీడీఓ అత్తోట దీప్తి, ఎంఈఓ తెనాలి ఇందిర, వైఎస్సార్ సీపీ నాయకులు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ శివన్నారాయణ, శంకర్‌రెడ్డి, నల్లిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో..

తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్ పాల్గొని ఎంపీడీఓ శివన్నారాయణతో కలసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను తిలకించారు.

ముగిసిన ఏఎన్‌యూ వాలీబాల్ జట్టు శిక్షణ

తెనాలి అర్బన్: అంతర్ కళాశాలల పోటీలలో పాల్గొననున్న ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వాలీబాల్ జట్టు శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ నెల 22 నుంచి తెనాలి జేఎంజే కళాశాలలో శిక్షణ ఇచ్చినట్లు పీడీ డాక్టర్ అరుణ సుజాత తెలిపారు. బుధవారం నుంచి జరగనున్న పోటీల్లో జట్టు పాల్గొనున్నట్లు చెప్పారు. జట్టు కోచ్‌గా రవీంద్ర, మేనేజర్‌గా తాను వ్యవహించనున్నట్లు తెలిపారు.



అంకితభావంతో ప్రజాసేవ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: అంకితభావంతో బజరంగ్ ఫౌండేషన్ ప్రజాసేవను కొనసాగిస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, ప్రజారంజక పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్పూర్తితో ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని ఈనెల 21న ఉప్పలపాడులో జరిగిన బజరంగ్ సంగమం కార్యక్రమంలో నేత్రజ్యోతి పేరిట వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న గ్రామస్తులు 609 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. వారికి మంగళవారం బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి పేదలపై ఉన్న శ్రద్ధను విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బజరంగ్ ఫౌండేషన్ నిర్ణయించిందని తెలిపారు. నేత్ర సమస్యలతో బాధపడేవారికి ఊరట కలిగించి, వెలుగునిచ్చే కార్యక్రమంగా బజరంగ్ నేత్రజ్యోతి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పని చేస్తోందని పేర్కొన్నారు. బజరంగ్ సామాజిక సేవా విభాగ బృందం సభ్యులు కళ్లజోళ్ల ఆవశ్యకత ఉన్న వారిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి, బజరంగ్ సంక్షేమ సంగమం ద్వారా వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

1న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో నూతన సంవత్సర వేడుకల్ని పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు అలనాటి సినీ మధుర గీతాల్ని ఆలపిస్తారని ఆయన పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

లారీ, ట్రాలీ ఢీ.. డ్రైవర్ మృతి

తెనాలిరూరల్: ట్రక్కు ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తెనాలి-విజయవాడ రహదారిలో నంది వెలుగు, కంచర్లపాలెం అడ్డ రోడ్డు మధ్య మంగళవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న లారీ, ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. ఆటోలో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీయించారు.



మృతుడు నంది వెలుగుకు చెందిన తోట పవన్(28)గా గుర్తించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదంతో రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన సందర్భంగా ఆటో వెనుక ఉన్న మరో కారు ఆటోను ఢీకొట్టింది. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని పోలీససులు తెలిపారు.

షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపులో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. జేకేసీ కళాశాల సమీపంలో బి.సత్యనారాయణ కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం తెరిచేందుకు వెళ్లగా షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా గల్లా పెట్టెలోని రూ. 40వేలతో పాటు కొంత సరుకు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బొంగరాలబీడుకు చెందిన వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెంలో నివసించే షేక్ నిలోఫర్ తన ఇంటి బయట మేకపిల్లను కట్టివేసింది. పక్కనే నివాసం ఉండే ఖాజా మొహిద్దీన్ ఈనెల 25న ఎందుకు కట్టావంటూ నిలోఫర్‌తో గొడవపడి కర్రతో దాడి చేసి, గాయపరిచాడు. ఈ మేరకు మంగళవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీపై రైతులకు శనగ విత్తనాల పంపిణీ

కాకుమాను: మిచాంగ్ తుపాన్ కారణంగా పంటల్ని కోల్పోయిన ప్రతి రైతుకీ రాయితీపై శనగ విత్తనాలు అందజేస్తామని పొన్నూరు సబ్ డివిజన్ ఏడీఏ వి.రామకోటేశ్వరి తెలిపారు. మండలంలోని కాకుమాను, గార్లపాడు, కొమ్మూరు, బీకేపాలెం, కొండపాటూరు గ్రామాల్లో మంగళవారం రైతులకు 80 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకు కూడా విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ హైమావతి, ఏవో కె.కిరణ్మయి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



కొరిటెపాడు: గోరంట్లలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో దీక్ష స్వీకరించిన స్వాములకు 41 రోజుల సద్ది మంగళవారం ముగింపు సందర్భంగా అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములకు, భక్తులకు సద్ది వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ సద్ది ఏర్పాట్లను మహా యజ్ఞంలా భావించి విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, ఆతుకూరి వెంకటేశ్వర్లు, సీహెచ్. కనకారావు, యర్రంశెట్టి సూరి, పులి శివకోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా చిరస్మరణీయుడు



మంగళగిరిలో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి



ఇప్పటంలో మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఉండవల్లి సెంటర్‌లో వంగవీటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: వంగవీటి మోహన రంగా చిరస్మరణీయుడని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. రంగా వర్ధంతిని మంగళగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి పాల్గొని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లేశ్వరరావు, పెద్దబ్బాయి, వి.విజయ్, ఆదాం, వాసు, కోలిరాజు, రాజ్యలక్ష్మి, మాలిక్ బాబు, ఎండి ఫిరోజ్, గుండా మధు, గౌస్ పాల్గొన్నారు.

కుంచనపల్లిలో....

కుంచనపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిరియాల రాంబాబు ఆధ్వర్యంలో మోహనరంగా వర్ధంతి కార్యక్రమాన్ని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మాజీ వైస్ చైర్మన్ డి.రామకృష్టారెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్శి విజయశ్రీ, ఎండీ గోరేబాబు, మాజీ ఎంపీటీసీ గోగుల శ్రీను, రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు యు.కళ్యాణ్, బాలకోటయ్య, మనోహర్, రమేష్, పుష్పరాజు, పాపారావు, రాజారావు, నాని పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో...

తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో వంగవీటి మోహనరంగా వర్ధంతిని వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వరరావు, నాయకులులచ్చి తులసిదాసు, బ్రహ్మారెడ్డి, వి.హరిబాబు గౌడ్, జి.లక్ష్మీనారాయణ(చిన్న), ఎ.శ్రీనివాసరావు, జి.నగేష్‌బాబు, సాధు కిషోర్ పాల్గొన్నారు.

రంగా అనుచరుల ఆధ్వర్యంలో....

వంగవీటి మోహనరంగా అనుచరులైన గాదె పోతురాజు, ఉప్పు హరిబాబు ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగా చిత్రపటానికి వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏలూర్పి ఆదయ్య, ఎం.దశరథ రెడ్డి, కె.సంజీవరెడ్డి, రాఘవరావు, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రంగా సేవలు మరువలేనివి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: పేదల కోసం అహర్నిశలు శ్రమించిన వంగవీటి మోహన రంగా సేవలు చిరస్మరణీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని తన కార్యాలయంలో వంగవీటి మోహన రంగా వర్ధంతి మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సేవకోసం తన జీవితాంతం పోరాడిన మోహన రంగాను పొట్టన బెట్టుకున్న పార్టీతో పవన్ జతకట్టడం సిగ్గుచేటన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కాపుల మద్దతు ఉంటుందనీ, పార్టీ పేరుతో కాపుల ఆత్మగౌరవాన్ని బాబుకు అమ్మకానికి పెట్టిన పవన్ కళ్యాణ్‌కు కాపుల ఆదరణ ఎప్పటికీ ఉండదన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, గుంటూరు రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, తాడికొండ జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, పార్టీ తాడికొండ మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, వివిధ విభాగాల నాయకులు పొన్నగంటి శ్రీనివాసరావు, కొప్పుల శేషగిరిరావు, బుర్రా శివారెడ్డి, ఆరేపల్లి జోజి, ముత్యాల రాజు, కందుకూరు జ్యోతి, డీజే శ్రీనివాసరావు, పుట్టా బాజీ పాల్గొన్నారు.



మోహన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సుచరిత, దయాసాగర్ దంపతులు